

నూతన ఉపాధ్యాయులకు అవగాహన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలో మెగా డీఎస్సీ 2025 లో ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సర్వీస్ సంబంధిత అవగాహన కార్యక్రమం యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్ బాలకృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కన్నయ్య, కె రఘునాథ్ పాల్గొని గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయ వత్తిని చేపట్టిన మీరు సేవ భావంతో అంకితభావంతో పనిచేసే గిరిజన విద్యాభివృద్ధికి కషి చేయాలని కోరారు .అదేవిధంగా సర్వీస్ సంబంధిత విషయంలో అవగాహనపరిచి సర్వీస్ రిజిస్టర్ నమోదు, ప్రాన్, పాన్ కార్డు, క్యాజువల్ లీవ్స్, ఆన్లైన్ డేట్ అఫ్ వర్క్ పై అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో నూతన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పనిచేయడం కొత్త అనుభవం అని, గిరిజన ప్రాంతంలో మమేకమై అంకితభావంతో పనిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు ప్రధాన కార్యదర్శి కె రాజారావు, కార్యదర్శులు శ్రావణ్ కుమార్ ,జి దుక్కు, మేఘనాథ్, తదితర సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్లలో ఆందోళన

- పలు పాఠశాలలకు డిఎస్‌సి-2025 ఉపాధ్యాయులను నియమించిన ప్రభుత్వం
- నిబంధనలకు విరుద్ధమంటున్న బాధితులు



ప్రజాశక్తి-పెదబయలు: గిరిజన గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం పొగపెట్టినట్లు కనిపిస్తుంది. ఇప్పటికే గిరిజన గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉపాధ్యాయ పోస్టుల్లో ప్రభుత్వం 2025 డిఎస్‌సిలో అర్హత సాధించిన వారిని నియమించింది. దీంతో ఏళ్ల తరబడి గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డిఎస్‌సి ద్వారా నియమించడం గురుకుల నిబంధనలకు విరుద్ధమని వారు అంటున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 196 గురుకుల పాఠశాలల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి 1653 మంది గెస్ట్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీళ్లకు గత నెలలోనే వేతనాలు రూ.14వేలు నుండి రూ.24 వేలుకు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. జీతాలు పెరిగాయన్న ఆనందం ఎంతో కాలం ఉండని పరిస్థితి నెలకొంది. డిఎస్‌సి-2025లో అర్హత సాధించిన ఉపాధ్యాయులను 1143 మందిని గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం నియామకం చేసింది. వీరంతా ఈ నెల 13న విధుల్లో చేరారు. ఈ విధంగా పెదబయలు గురుకుల పాఠశాలకు టిజిటి (టీచర్ గ్రేడ్ ట్రైనింగ్ టీచర్) గ్రేడ్‌లో 14 మంది ఉపాధ్యాయులు వచ్చారు. దీంతో ఇప్పటికే 10, 15, 20 ఏళ్ల నుండి అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో టెన్షన్ మొదలైంది. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పని చేస్తున్న పోస్టుల్లోకి కొత్త ఉపాధ్యాయులు రావడంతో ఇప్పటికే పని చేస్తున్న వారిని ఉంచుతారా? తొలగిస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒక వేళ ఉంచితే వారికి బిల్లు పెట్టి వేతనాలు చెల్లించాలి. కాని జీతాల బిల్లులు పెట్టే పరిస్థితుల్లో ప్రిన్సిపల్స్ లేనట్లు వారి మాటల్లో కనిపిస్తోంది. గురుకులం ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వస్తేనే గాని ఏ విషయం చెప్పలేమని ప్రిన్సిపల్స్ అంటున్నారు.

గురుకుల నిబంధనలకు విరుద్ధం

సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయ వృత్తినే నమ్ముకొని గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్న తమ పరిస్థితి ఏమిటని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. డిఎస్‌సి ద్వారా గురుకుల పాఠశాలలకు ఉపాధ్యాయ నియామకం గురుకుల నియమ నిబంధనలకు విరుద్ధమని, గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకానికి ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చి దాని ద్వారా నియామకం చేయాల్సి ఉంటుందని వారు అంటున్నారు. గురుకుల నియమ నింబంధనలను రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన గురుకులంలో సర్వీస్ అందిస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి గురుకులం ద్వారా స్పీక్ ఆర్డర్ తెచ్చుకొని విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి ఇచ్చిన స్పీక్ ఆర్డర్‌ను పరిగణనలోకి తీసుకొని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కొనసాగించాల్సి ఉంది. కాని డిఎస్‌సి ద్వారా కొత్త ఉపాధ్యాయులను నియమించడంతో తాము రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు వాపోతున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు వస్తే తమ ఉపాధికి రక్షణ ఉంటుందని తామంతా భావించామని, కాని బాబు వచ్చి జాబ్ పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి తాము ఉపాధి కోల్పోకుండా విధుల్లో కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బాలికల దినోత్సవం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:: మండలంలోని జోలపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని యు విమల కుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్నీ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు మగ పిల్లలతో సమానంగా అన్ని రంగాల్లోను ప్రతిభ కనబరచాలని సూచించారు. ఆడపిల్లలు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా బాల్యవివాహాలు చేస్తే తమకు సమాచారం అందించాలనీ కోరారు. ప్రధానోపాధ్యాయులు ఎస్ గున్నయ్య మాట్లాడుతూ, బాలికలు బాగా చదువుకోవాలని కోరారు. అనంతరం మ్యూజికల్ చైర్ ఎస్సే రైటింగ్ పోటీలను నిర్వహించారు. బాలికలతో మానవహారం ర్యాలీ ప్రతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం: సిఐటియు

ప్రజాశక్తి-పెదబయలు: వెలుగు వివోఎల ఐక్య పోరాట ఫలితమే మూడు సంవత్సరాల కాలపరిమితి సర్కిలర్ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని సిఐటియు అల్లూరి జిల్లా నాయకులు బోండా సన్నీబాబు తెలిపారు. పెదబయలు మండల కేంద్రంలో అగ్రికల్చర్ ఆఫీస్ ఆవరణలో మండలంలో వెలుగు లో పనిచేస్తున్న వివోఏల అభినందన సభ జరిగింది. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా వివోఏలు అనేక రకాల ఆటు పోట్లకు రాజకీయ ఒత్తిళ్లకు గురై అతి తక్కువ గౌరవ వేతనంతో గ్రామస్థాయిలో పనిచేస్తూ సేవలందిస్తున్న వెలుగు వివోఏలకు దీర్ఘకాలికమైన సమస్యలు పరిష్కారం చేసే దాంట్లో అనేక ప్రభుత్వాలు మారినప్పటికీ వివోఎల తలరాతలు మాత్రం మారలేదన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వానికి దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫైవ్ జి ఫోన్లు వెంటనే ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పోరాట ఫలితంగా కూటమి ప్రభుత్వం దిగివచ్చి మూడు సంవత్సరాలు కాలపరిమితి సర్కిలర్ ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వివోఏ దీర్ఘకాలికమైన సమస్యలపై రాబోయే కాలంలో అందరూ ఐక్యంగా ఉండి పోరాటం నిర్వహించాలని పోరాటాల ద్వారానే కార్మికుల యొక్క సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ సందర్భంగా అన్నారు ఈ అభినందన సభలో ఆ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్,జిల్లా కార్యదర్శి ఎల్బి రాజ్ కుమార్, వివో ఎలా జిల్లా నాయకులు ఈ పోతురాజు, భాస్కర్ రావు బాలకష్ణ శ్రీ వెంకటలక్ష్మి పెదబయలు మండల అధ్యక్ష కార్యదర్శులు బోండరాజు బాబు, వి రమేష్, త్రినాధ్ పడాల్ జగన్ ఈశ్వర్ రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్నిబాబు



విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తప్పిపోయిన విద్యార్థులు.. తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి-అరకులోయ: పెదబయలు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో మంగళవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయిన విద్యార్థులను బుధవారం అరకులోయలో పోలీసులు పట్టుకున్నారు. పాడేరు డిఎస్‌పి షేక్ షెహ బాజ్ అహ్మద్ ఆధ్వర్యాన తల్లిదండ్రులకు అప్పగించారు. అల్లూరి జిల్లా పెదబయలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్లోని ముగ్గురు విద్యార్థులు కనిపించకపోవడం సంచలనంగా మారింది. పెదబయలు ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పి.అరవింద్, ఎం.అశోక్, బి.సాయితేజ మంగళవారం ఉదయం నుండి పాఠశాలలో లేరు. దీన్ని గుర్తించిన సిబ్బంది విద్యార్థుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ ఇళ్లకు పిల్లలు రాలేదని చెప్పడంతో పాఠశాల ప్రిన్సిపల్ బుధవారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కనిపించకుండా ఉన్న ముగ్గురు విద్యార్థులు హుకుంపేట మండలం ఉక్కుర్బ, బంగారుమెట్ట, మద్దిపుట్టు గ్రామాలకు చెందిన వారు. ఈ ఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదబయలు ఎటిడబ్ల్యూఒ స్వర్ణలత, జిల్లా గురుకులం సెల్ నోడల్ ప్రిన్సిపల్ మూర్తి పాఠశాలకు వెళ్లి విచారణ జరుపుతున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ పెదబయలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుతో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు పాడేరు డిఎస్‌పి నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చర్యలు చేపట్టారు. విద్యార్థులు తప్పిపోయిన విషయాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో అరకు గ్రామానికి చెందిన కార్పెంటర్ సుబ్రహ్మణ్యం అరకులో విద్యార్థులను గుర్తించి అరకులోయ సిఐ హిమగిరికి సమాచారం అందించారు. సిఐ సిబ్బందితో వెళ్లి విద్యార్థులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకొచ్చి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. చదువుపై ఆసక్తి లేకపోవడం వల్లే విద్యార్థులు పాఠశాల విడిచిపెట్టి పారిపోయినట్లు తెలిపారని డిఎస్‌పి చెప్పారు. విద్యార్థుల ఆచూకీ తెలిపిన కార్పెంటర్ సుబ్రహ్మణ్యాన్ని, పట్టుకున్న పోలీసులను డిఎస్‌పి అభినందించారు.

చాకిరేవుల గ్రామంలో కలెక్టర్ పల్లె నిద్ర

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల మండలం వీరవరం పంచాయతీ పరిధిలోని మారుమూల చాకిరేవుల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్‌తో పాటు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శ్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని, వీరవరం గ్రామం నుండి వెదురునగరం వరకు రహదారి ఏర్పాటు చేయాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని, వీరవరం నుండి కొయ్యూరు మధ్యలో కాలువపై వంతెన నిర్మించాలని, గిరిజన భూములకు సాగునీరు అందించే కన్నీరు వాగు, (ఏలేరు) కాలువపై రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి గ్రామ సమస్యలు పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం తనకు చాలా సంతృప్తినిచ్చిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ దొరకయ్య, ఎంపీడీవో ఎవివి.కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డి.నాగరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య, ఆశ్రమ పాఠశాలల సందర్శన

అడ్డతీగల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను, వీరవరం గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ మంగళవారం రాత్రి సందర్శించారు. పాఠశాలలో ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నది, ఎంతమంది విద్యార్థులు ఉన్నది ఆరా తీశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు విద్యను బోధించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం మెనూ పక్కగా అమలు చేయాలన్నారు.



కలెక్టర్, ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న చాకిరేవుల గ్రామస్తులు

పిహెచ్‌సి వైద్యుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- విఆర్.పురం : పిహెచ్‌సి వైద్యుల సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని జీడిగుప్ప పిహెచ్‌సి వద్ద వైద్యులకు మద్దతుగా బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర సలహాదారులు మడివి నెహ్రూ మాట్లాడుతూ వైద్యుల పోరాటానికి మద్దతుగా ఏజెన్సీ వ్యాప్తంగా అన్ని పిహెచ్‌సిలలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరలించి విధులు చేపడుతున్నట్లు చెప్పారు. గత 11 రోజులుగా విజయవాడ ధర్నా చౌక్ వద్ద వైద్యులు ఆందోళనలు చేస్తున్నా, ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకపోవడం సరికాదన్నారు. వైద్యుల సమ్మెతో ప్రజలకు, ముఖ్యంగా గర్భిణులు, ప్రసూతి కేసులు, అత్యవసర కేసులకు అవసరమైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఆ ఒత్తిడి కిందిస్థాయి క్లినికల్, పారామెడికల్ సిబ్బందిపై తీవ్రంగా పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ అసిస్టెంట్ల, సీనియర్ అసిస్టెంట్ల కొరత తీవ్రంగా ఉన్న వైద్య ఆరోగ్య శాఖలో వైద్యాధికారులుగా సిబ్బంది జీతభత్యాల బిల్లులు చేస్తున్నారని, డాక్టర్ల ధర్నాల కారణంగా ఈ నెల సిబ్బందికి జీతభత్యాలు అందుతాయో లేదోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రోగులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్లినికల్ స్టాఫ్, పారామెడికల్ సిబ్బంది చూసుకుంటున్నారని, ప్రభుత్వం వెంటనే డాక్టర్ల సమస్యలను పరిష్కరించి విధులకు హాజరయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. లేకుంటే క్లినికల్, పారామెడికల్ సిబ్బంది కూడా దశలవారీగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఆరిక ఉషారాణి, ఎస్ఎన్ భాగ్యలక్ష్మి, ఫార్మసీ ఆఫీసర్ అనిగి ప్రవీణ్, ఎల్‌టి సౌజన్య, ఎంఎన్ఓ పాయం వెంకటేష్, ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివకుమార్

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : సైబర్ నేరాలు, మహిళా భద్రత, గంజాయి నివారణపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యాన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆన్‌లైన్ భద్రత ప్రాముఖ్యత, మహిళా భద్రతా చర్యలు, గంజాయి ఇతర మాదకద్రవ్యాల దుష్ప్రభావాల గూర్చి తెలియజేశారు. విద్యార్థులు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని నివారించాలని, సైబర్ నేరాలను వెంటనే నివేదించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి శ్రీనువాసరావు, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సిపిఆర్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-అడ్డతీగల : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం సిపిఆర్‌పై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎటువంటి నివారణ చర్యలు తీసుకోవాలో అనే దాని గురించి అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీహర్ష సిపిఆర్ ఎలా చేయాలో నేర్పించారు. హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు మాట్లాడారు. అనంతరం అవగాహనా ర్యాలీ హాస్పిటల్ ఆవరణలో చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ స్టాఫ్, హెడ్ సిస్టర్, దేవుడు, ఊహ, సునీత, విజయ, శానిటేషన్ స్టాఫ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-చింతూరు : మండల చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ కమిటీ సభ్యులు బొడ్రాయిగూడెం గ్రామంలో బాల్య వివాహాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేయకూడదని సూచించారు. బాల్య వివాహాలు చేస్తే నాన్ బెయిల్ బుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. బాల్య వివాహం జరిపించిన , నిర్వహించిన, ప్రణాళిక చేసిన, ఆదేశించిన వారందరికీ రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. చిన్న వయసులో వివాహం జరపడం వలన తల్లికి, బిడ్డకి ప్రమాదకరమని, మాతా శిశు మరణాలు జరిగే అవకాశం ఉందని, పిల్లలు తక్కువ బరువుతో పుట్టడం, పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. డ్రాప్ ఔట్ పిల్లలను తిరిగి స్కూల్‌లో జాయిన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్ దొర, చింతూరు మండల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి పి.జయలక్ష్మి, పోలీస్ శాఖ నుండి కే.విజయకుమార్, మండల డిప్యూటీ ఎంపిడిఓ, సెక్టార్ పర్యవేక్షణ అధికారి పి.సంఘమిత్ర, ముకునూరు సచివాలయం సెక్రటరీ విద్యాసాగర్, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి, విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరల్డ్ హ్యాండ్ వాషింగ్ డేపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే భోజనం తినే ముందు తిన్న తర్వాత చేతులు శుభ్రమంగా కడుక్కోవాలని రంపచోడవరం డివిజనల్ డెవలప్మెంట్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఆకురు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన శ్రీనివాస విశ్వనాథ్ సిబ్బందితో 'వరల్డ్ హ్యాండ్ వాషింగ్ డే' కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. మనమిత్ర వాట్సాప్ సేవలను, ఆది కర్మయోగి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను, సూపర్ జి.ఎస్.టి సూపర్ సేవింగ్స్ తదితర ప్రజా ప్రయోజన కార్యక్రమాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకొని వెళ్లాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ కె సురేష్ రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.గంగాభవాని, మహిళా పోలీస్ సిహెచ్ ప్రేమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మిక రహదారి బురదమయం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని కొమ్మిక గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. ఈమధ్య కురిసిన భారీ వర్షాలకు రహదారి ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడి, బురదమయంగా మారింది. బుధవారం కొమ్మిక రైతు సేవా కేంద్రానికి యూరియా తరలిస్తున్న లారీ రహదారి మధ్యలో కూరుకుపోయింది. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బురదలో కూరుకు పోయిన లారీని తోస్తున్న స్థానికులు

ప్రాక్టీస్ మ్యాచ్‌లో గిరిజన విద్యార్థులు


వరల్డ్ కప్ ప్లేయర్స్‌తో విద్యార్థులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:విశాఖపట్నంలోని ఎసిఎ విడిసిఎ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఉమెన్ వరల్డ్ కప్ ప్లేయర్స్‌తో గిరిజన విద్యార్థులు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడినట్లు నేచర్ సంస్థ ఎస్ వికాస్ బాలరాజు తెలిపారు. డైరెక్టర్ నేచర్ స్వచ్ఛంద సంస్థ, యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో 18 సంవత్సరాల లోపు పిల్లల కోసం ఒక ప్రత్యేకమైన క్రికెట్ ప్రాక్టీస్ సెషన్ నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో నేచర్ సంస్థ డైరెక్టర్ ఎస్ వికాస్ బాలరాజు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతమైన అరకువేలి నుండి 10 మంది పిల్లలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం పిల్లల్లో క్రీడా స్ఫూర్తి, సమానత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించడమేనన్నారు. ఆస్ట్రేలియా అంతర్జాతీయ క్రికెట్ జట్టుతో ప్రాక్టీస్ చేశారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి


పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రభుత్వ పాఠశాలల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎఫ్ 1 ,ఎఫ్ 2 పరీక్షలను ఉపాధ్యాయులు సజావుగా నిర్వహించాలని స్థానిక ఎంఈఓ ఎస్ సుందర్రావు చెప్పారు. బుధవారం మండలంలోని కించమండ బాలుర ఆశ్రమ పాఠశాలలో సందర్శించి విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సన్నద్ధం చేసే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలలకు హాజరై సమయపాలన పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి- చింతపల్లి:చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిపిఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎం.డి. అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ సాహితి ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ ప్రక్రియను ఎలా చేయాలో ప్రాక్టికల్‌గా వివరించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. విజయ భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, డాక్టర్ సాహితి మాట్లాడుతూ ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వ్యక్తులకు తక్షణ సిపిఆర్ చేయడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని, అందరూ ఈ విధానం నేర్చుకోవాలని సూచించారు. అకస్మాత్తుగా కుప్ప కూలిన వ్యక్తులకు సిపిఆర్ ఎలా చేయాలో విద్యార్థులకు దశలవారీగా చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై హర్షం


మాట్లాడుతున్న దొన్నుదొర

ప్రజాశక్తి-హుకుంపేట: విశాఖలో గూగుల్ సంస్థ ఏర్పాటు చేయడంపై టిడిపి అరకు ఇన్‌చార్జ్, ఏపీఎస్‌ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా హుకుంపేట మండల కేంద్రంలో టిడిపి శ్రేణులు టపాసులు పేల్చి, బాణ సంసారాలతో సంబరాలు నిర్వహించి ఆనందం వ్యక్తం చేశారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు నాయకత్వం, ఐటీ మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి ఇదే అత్యంత పెద్ద పెట్టుబడి ప్రాజెక్టుగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. పెట్టుబడులు రాబట్టేందుకు ప్రభుత్వం జాతీయ ఎఫ్‌డిఐ విధానాల్లో సవరణలు చేసి మార్గం సుగమం చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్ సుందర్, మాజీ సర్పంచ్ పాడి బాలన్న, హుకుంపేట ఎంపీటీసీ కొమ్మ రమ, బొడ్డపుట్టు సర్పంచ్ పాడి అచ్చులమ్మ, మాజీ ఎంపీటీసీ పొందోయి కాంతమ్మ, మండల ఉపాధ్యక్షులు లకే నాగేశ్వరరావు, అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొర్ర సంతోష్ కుమార్, అరకు అసెంబ్లీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చప్పాలి శంకర్, యూనిట్ ఇన్‌చార్జి సోమెలి లక్ష్మయ్య పాల్గొన్నారు.

బధిరులకు ప్రత్యేకమైన సైన్ లాంగ్వేజ్

జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ శ్రీపూజ


మాట్లాడుతున్న పిఒ తిరుమణి శ్రీపూజ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వివిధ్న సామర్థ్యాలు కలిగిన వ్యక్తులను, ముఖ్యంగా వినికిడి లోపం ఉన్న వారిని నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దడం ఎంతైనా అవసరమని జెసి, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ అన్నారు. బుధవారం స్థానిక కాఫీ క్లబ్ లో నిర్వహించిన జాతీయ ప్రపంచ సాంకేతిక దినోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ...సమాజంలో బధిరుల కోసం ప్రత్యేకమైన సైన్ లాంగ్వేజ్ ఉంటుందని పూర్తి నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా తయారు చేయవచ్చన్నారు. సైన్ లాంగ్వేజ్ అనేది ఒక నాట్యం లాంటిదని వివరించారు. పూర్వకాలంలో భరత నాట్యంలో మాటలు లేకుండా, కేవలం ముఖ కవళికలు, చేతుల సైగల ద్వారానే మహాభారతం, రామాయణం వంటి కథాంశాలను చెప్పేవారని ఉదహరించారు. సైన్ లాంగ్వేజ్‌కు యూనిఫామ్ లాంగ్వేజ్ ఉండదని, ఇది ఒక ఆర్టిస్టిక్ టాలెంట్ అని, ఆసక్తి ఉన్నవారు దీనిని నేర్చు కోవచ్చన్నారు. ఉపాధి అవకాశాల గురించి మాట్లాడుతూ, కొన్ని ప్రముఖ సంస్థలైన కెఫెసిలు, మెక్‌డొనాల్డ్స్ వంటివి కస్టమర్‌గా సైన్ లాంగ్వేజ్ ఆధారంగా డెలివరీలు, ఆర్డర్స్ తీసుకుంటున్నాయని తెలిపారు. బధిరుల కోసం ప్రత్యేకమైన సైన్ లాంగ్వేజ్ (చిహ్నలతో ఉన్న) గోడ ప్రతిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి, వివిధ ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కవిత, వివిధ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని జోలపుట్టు గ్రామపంచాయతీ పరిధిలో వల్ల లబ్బూరు గ్రామ సమీపంలో నూతన ఏకలవ్య పాఠశాల, కళాశాలలో తలెత్తిన రన్నింగ్ వాటర్, త్రాగునీరు, మరుగుదొడ్ల, ప్రహరీ గోడ నిర్మాణాలతో పాటు, విద్యుత్ సమస్యలు ఉన్నాయని విద్యార్థిని, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయగా పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ రామదాసు ఏకలవ్య ప్రిన్సిపల్ తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, వారం రోజులు గడుస్తున్నా స్నానాలకు నీళ్ళు లేవని, విద్యార్థినిలు నెలసరి సమస్యలకు నీళ్లు లేక అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారని, త్రాగునీటి సమస్యతో వ్యాధుల బారిన పడిన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, సరైన మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయట మలవిసర్జనకు వెళ్లవలసిన దుస్థితి ఏర్పడిందని ప్రిన్సిపల్ సుమన్ కు తెలిపారు. ప్రిన్సిపల్ సుమన్ మాట్లాడుతూ, తలెత్తిన సమస్యలపై పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఎస్ఎంసి చైర్మన్ రామదాసు మాట్లాడుతూ పాఠశాలలో ప్రహరీ నిర్మాణాలు లేకపోవడంతో పాటు, విద్యుత్ సమస్యలు తలెత్తడం, నైట్ వాచ్‌మెన్ లేకపోవడం విచారకరమన్నారు. ఉపాధ్యాయులు సమ్మె కారణంగా అందుబాటులో లేకపోవడంతో పూర్తిస్థాయిలో విద్యార్థులకు సంరక్షణ లోపించిందని తెలిపారు . సమస్య పరిష్కారానికి ఈనెల 25వ తేదీ పేరెంట్స్ మీటింగ్ లో తీర్మానం చేసి ఉన్నత అధికారులకు నివేదిక పంపించే చర్యలు చేపట్టే విధంగా బాధ్యత వహించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-హుకుంపేట: అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్త్ డిపార్ట్‌మెంట్, ఐసిడిఎస్ సహకారంతో మండలంలోని తీగలవాలస పంచాయతీ కామయ్యపేట గ్రామంలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ డిపార్ట్‌మెంట్ నుండి ఏఎన్ఎంలు రహీల్, భాగ్యవతి ఎంఎంఎల్‌హెచ్ పి.నాగమణి మాట్లాడుతూ, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.చేతులు కడగకపోవడంతో కలిగే ఆరోగ్య సమస్యలను వివరించారు, ప్రతిరోజు భోజనం ముందు, మరుగుదొడ్ల వినియోగం తర్వాత, పిల్లల సంరక్షణ సమయంలో తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడగడం ద్వారా కంటికి కనిపించని క్రిములు, సూక్ష్మజీవులను నివారించ వచ్చని తెలిపారు.ఇలా చేస్తే డయేరియా, అతిసారం, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వంటి అంటువ్యాధులను నివారించవచ్చని చెప్పారు. కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉండేందుకు చేతుల పరిశుభ్రత అత్యంత ముఖ్యమని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మానసి సంస్థ క్లస్టర్ కోఆర్డినేటర్ దుడ్డు వినోద్ కుమార్, మానసి మిత్ర దివ్య కుమారి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


రోధిస్తున్న బంధువులు

వైద్యుల నిర్లక్ష్యంతో రోగి మృతి

మృతుని కుటుంబీకుల ఆరోపణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కించయి పుట్టు గ్రామ పంచాయితీ పరిధిలో గల ఇందిర కాలనీ లో నివాసం ఉంటున్న టొంగి ఆదినారాయణకు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో అస్వస్థతకు గురికాగా కుటుంబసభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో హుటాహుటిన చికిత్స నిమిత్తం తరలించారు. సిహెచ్సిలో విధుల్లో ఉన్న డిప్యూటేషన్ వైద్య అధికారి సకాలంలో వైద్య సేవలు అందించలేదని, తీవ్ర అసస్థతకు గురైనప్పటికీ మెరుగైన వైద్య సేవలు నిమిత్తం జిల్లా ఆసుపత్రిలో తరలించడంలో జాప్యం వల్లే మృతి చెందాడని భార్య సావిత్రి, కుటుంబ సభ్యులు టి ధనుష్ కుమార్, లైలారాణి , కోమలి రాణి, అజయ్ లు ఆరోపించారు. అనంతరం మృతుడి కుమారుడు టీ ధనుష్ కుమార్ మాట్లాడుతూ అంబులెన్స్ మరమ్మతులు గుర్తైన కారణాలు చెప్పి మంగళవారం మధ్యాహ్నం నుండి వేరే 108 వాహనం వస్తుందని చెప్తూ కాలయాపన చేసి వైద్యులు నిర్లక్ష్య ధోరణి వ్యవహరించాలన్నారు. బుధవారం ఉదయం ఐదు గంటల సమయంలో పరిస్థితి విషమించి తన తండ్రి మృతి చెందగా కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రంగా ఆగ్రహించారు. వైద్యులు , సిబ్బందితో కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగగా సిహెచ్సి సూపరిండెంట్ డాక్టర్ గీతాంజలి పొంతన లేని సమాధానాలు చెబుతూ మతుని కుటుంబ సభ్యులకు సముదాయించేందుకు ప్రయత్నించడం తో ఆమెపై మండిపడ్డారు. మృతుడి కుటుంబ సభ్యులు పలువురు మాట్లాడుతూ అంబులెన్స్ సక్రమంగా లేనప్పుడు ఆసుపత్రి సూపరిండెంట్ బాధ్యతగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపి అంబులెన్స్ మరమ్మతలకు త్వరితగతిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత లేదని ప్రశ్నించారు.

మూగజీవాల మృత్యువాత

ప్రజాశక్తి- అనంతగిరి:సరైన వైద్య సేవలు అందక మూగజీవులు మత్యువాతకు గురవుతునాయి అనంతగిరి పశువు సమర్ధశాఖ పరిది లుంగపర్తి. అనంతగిరి .పంచాయతీ పరిధి కేంద్రాలలో పలు వ్యాధులతో బారిన పడి మత్యవతాకు గురికావడమే కాకుండా. లంపి వ్యాధులతో బారినపడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. లుంగపర్తి పంచాయతీ పరిధి ఓనుకొండ గ్రామానికి చెందిన రైతులకు చెందిన మేకలు మృతి చెందాయి. అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామానికి చెందిన.జె.రామూర్తి. చిన్నరావు లకు చెందిన దుక్కటి ఎద్దులు లంపి వ్యాధితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని సంబంధిత అధికారులు తక్షణమే గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మూగజీవులకు వైద్య సేవలు అందించాలని, పశువు మేకలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

డుంబ్రిగుడలో బైక్ చోరీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:-మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఓ బైక్ చోరీకి గురైంది. మండల కేంద్రంలో డిష్ టీవీ టెక్నీషియన్ గా షాపు నిర్వహిస్తున్న బి.రవి మంగళవారం తన పని ముగించుకొని బైక్ 220 పల్సర్ ను వారు అద్దెకు ఉంటున్న ఇంటి బయట ఉంచి నిద్రపోయాడు. రాత్రి గుర్తు తెలియని దొంగలు అపహరించుకు పోయినట్లు ద్విచక్ర వాహనదారుడు రవి స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ విషయంపై బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు. మండల కేంద్రంలో ఓ బైకు చోరికి గురై సుమారు నెల గడవకముందే మరో బైక్ చోరీతో మండల కేంద్రంలో భయాందోళన కలిగిస్తుంది. కిరాణా దుకాణాల్లో ఈ మధ్యన తరచుగా దొంగతనాలు జరుగుతుండగా వాటితో పాటు బైకులు కూడా చోరీకి గురవుతుండడంతో మండల కేంద్ర వాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు ఇంటి బయట పెట్టాలన్న భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానిక వాహనదారులు అంటున్నారు. పోలీస్ శాఖ అధికారులు స్పందించి మండల కేంద్రంలో తరచుగా జరుగుతున్న ఇటువంటి చోరీ సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకునే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అభినవ విమర్శనా మార్గదర్శి ‘కట్టమంచి’

ప్రజాశక్తి- సీతమ్మధార : సహృదయ సాహితి విశాఖపట్నం ఆధ్వర్యంలో ప్రతి బుధవారం జరుగుతున్న సాహిత్య కార్యక్రమములో భాగంగా ‘బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమంచి’ అనే అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న ప్రసంగించారు. ముందుగా మంగళవారం తుదిశ్వాస విడిచిన ప్రముఖ రచయిత కవి, 101 సంవత్సరాలు జీవించిన రాచకొండ నరసింహశర్మ మరణానికి మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం ఆచార సిమ్మన్న మాట్లాడుతూ ముసలమ్మ మరణం, నవయామిని, పంచమి,వ్యాసమంజరి, అర్థ శాస్త్రం మొదలైన గ్రంథాలు రచించి, తెలుగు సాహితీ రంగంలో తనకంటూ ప్రత్యేకమైన విశిష్ట స్థానాన్ని కట్టమంచి రామలింగారెడ్డి ఏర్పరచుకున్నారన్నారు. కవితత్వ విచారం అనే విమర్శనా గ్రంథముచే అభినవ విమర్శనా మార్గదర్శి అయ్యారన్నారు. సభాధ్యక్షత వహించిన డాక్టర్ .కె.జి.వేణు మాట్లాడుతూ, కట్టమంచి రామలింగారెడ్డి ఆత్మ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రతిచోటా వినిపిస్తుందని అన్నారు., ముఖ్య అతిథి డాక్టర్.డి.వి.సూర్యారావు మాట్లాడుతూ, రాచకొండ నరసింహశర్మ మానవతావాది అని, అత్యధిక రచనలను అనువాదం చేసిన రచయితని కొనియాడారు. సిహెచ్ చిన సూర్యనారాయణ,ఉప్పల అప్పలరాజు, చల్లా రాంబాబు ,కె.భీమేశ్వరరావు, పరమేశ్వరరావు, డిఎస్.కుమార్,ఆర్.శివాజీ పాల్గొన్నారు.

నూతన శ్రేణి ఏసీలను ప్రారంభించిన శాంసంగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శాంసంగ్ బుధవారం తన తాజా మేడ్ ఇన్ ఇండియా స్మార్ట్ విండ్ ఫ్రీ (టీఎం) క్యాసెట్ ఎయిర్ కండిషనర్లను విశాఖలో విడుదల చేసింది. ఈ ఏసీలు కనెక్టివిటీ, పర్యావరణ అనుకూల డిజైన్, ప్రీమియం సౌకర్యంతో వాణిజ్య నివాస శీతలీకరణ పరిష్కారాలను అందిస్తుందని సామ్‌సంగ్ ఇండియా సిస్టమ్ ఏసీ హెడ్ విపిన్ తెలిపారు. సమర్థవంతమైన పనితీరుతో రూపొందించబడిన ఈ కొత్త శ్రేణిలో స్మార్ట్‌థింగ్స్ ఇంటిగ్రేషన్ కోసం అంతర్నిర్మిత వైఫై, సామ్‌సంగ్ ప్రత్యేక విండ్ ఫ్రీ కూలింగ్ టెక్నాలజీ అమర్చబడి ఉందని వివరించారు.

గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌కు విశేష ఆదరణ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : సెప్టెంబర్ 22న ప్రారంభమైన అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ -2025కు ఆంధ్రప్రదేశ్ లో విశేష ఆదరణ లభించిందని అమెజాన్ బజార్ ప్రోడక్ట్ బిజినెస్ హెడ్ సమీర్ లాల్వాని తెలిపారు. బీచ్ రోడ్‌లోని ఐటిసి గ్రాండ్ బే హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్మార్ట్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, బ్యూటీ, నిత్యావసరాలలో మంచి వీద్ధి కనిపించిందన్నారు. ఈ నెల 6వ తేదీ నుండి కస్టమర్లు అమెజాన్ డాట్ ఇన్‌లో ‘దీపావళి ప్రత్యేకం’తో డీల్స్ ఆఫర్లను పొందవచ్చని పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్స్‌పై 40 శాతం వరకు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, బ్యూటీ, హోమ్ కిచెన్, అవుట్ డోర్స్ పై 80 శాతం వరకు తగ్గింపు పొందవచ్చని వివరించారు. నిత్యావసరాలపై 70 శాతం వరకు తగ్గింపు, టీవీలు, గృహోపకరణాలపై 50 శాతం వరకు తగ్గింపును పొందవచ్చన్నారు.

శాంసంగ్ గెలాక్సీ ఎం17 5జి అమ్మకాలు ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : శాంసంగ్ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ ఎం17 5జి స్మార్ట్‌ఫోన్‌ను వినియోగదారులు నేటి నుండి కొనుగోలు చేయవచ్చని సంస్థ ప్రతినిధి కిరణ్ తెలిపారు. గెలాక్సీ ఎం 17 5జి అమెజాన్, శాంసంగ్ డాట్ కామ్, ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో అందుబాటులో ఉంచామని తెలిపారు. దీని 4/128 జిబి వేరియంట్ ధర రూ.12,499, 6/128 జిబి, 8/128 జిబి వేరియంట్లు వరుసగా రూ.13,999, రూ.15,499 ధరలకు లభిస్తాయన్నారు.

అమెజాన్ ఫెస్టివ్ డిలైట్ ఆఫర్లు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈ పండగ సీజన్‌లో అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025 స్మార్ట్ ఫోన్లు, ల్యాప్ టాప్స్, టివిలు, ఫ్యాషన్, బ్యూటీ, హోమ్ డెకార్, ఉపకరణాలు, ఫర్నిచర్, కిరాణా సరకులు సహా ధనత్రయోదశి, దీపావళి ఆఫర్లను ప్రారంభించిందని అమెజాన్ జిఐఎఫ్ హెడ్ జాన్ తెలిపారు. ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, ముంబయితో పాటు విశాఖ నగరంలో దీపావళికి ముందు డెలివరీ కోరుకునే కస్టమర్లు బజాజ్, హీరో టూ వీలర్స్‌ను ఆర్డర్ చేయవచ్చన్నారు.

కాలిఫోర్నియా బాదంతో పోషకాలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ప్రోటీన్, ఫైబర్, గుండెకు ఆరోగ్యకరమైన కొవ్వు సమృద్ధిగా ఉండే బాదం సంపూర్ణమైన ఆహారం అని పోషకాహార నిపుణులు మధుమిత కృష్ణన్ తెలిపారు. కాలిఫోర్నియా బాదంలో ప్రోటీన్, కాల్షియం, జింక్, డైటరీ ఫైబర్, మెగ్నీషియం, విటమిన్ ఇ వంటి 15 అవసరమైన పోషకాలు ఉన్నాయన్నారు. రక్తంలో చక్కెర నియంత్రణ, కండరాల పునరుద్ధరణ, గుండె ఆరోగ్యం, బరువు నిర్వహణతో సహ అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చన్నారు.

మద్యం బెల్ట్ షాపులు రద్దు చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కల్లుగీత కార్మిక నేతలు


ప్రజాశక్తి-కె.కోటపాడు : అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపులను రద్దు చేసి, గీత కార్మికులను ఆదుకోవాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్న గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల వల్ల గీత కార్మికులు, నిరుపేదలు జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని, వాళ్ల సంపాదించిన సొమ్ము అంతా మద్యానికి దారిపోస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే అన్ని ప్రజా సంఘాలు, మహిళా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమ చేస్తామని హెచ్చరించారు. గీత కార్మికులందరికీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని, వృత్తి రక్షణ కోసం తాటినార, తాటిబెల్లం పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయిలో వీఆర్వో, సర్పంచ్, సొసైటీ అధ్యక్షులు ద్వారా కమిటీ ఏర్పాటు చేసి అక్రమ మద్యం అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శెట్టి రమణ, శెట్టి ఫకీరు, శెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

17న విద్యుత్ కార్మికుల సమస్యలపై ధర్నాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి-చోడవరం : విద్యుత్ కార్మికుల సమస్యలపై ఈ నెల 17న మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సౌథ్‌లో పవర్ జెఎసితో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు డీఈ, ఏఈ కార్యాలయాల ఎదుట ధర్నాలు, బైఠాయింపులు వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు చోడవరం సబ్ స్టేషన్ వద్ద కమిటీ నాయకులు బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15న జరగాల్సిన సమ్మె చర్చల నేపథ్యంలో వాయిదా పడినట్లు చెప్పారు. ప్రభుత్వం హామీలు ఇస్తున్నా సమస్యలను నిర్దిష్టమైన సమయంలో పరిష్కరిస్తామనే స్పష్టత లేదని, కీలకమైన కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలనే అంశంపై యాజమాన్యం చేతులెత్తేసిందని పేర్కొన్నారు. నేరుగా వేతనాలు చెల్లించడం వల్ల సంవత్సరానికి రూ.192 కోట్లు మిగులుతాయని లెక్క తేల్చిన యాజమాన్యం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్స్ ఇంప్లిమెంట్ చేసి జేఎల్ఎం2లకు న్యాయం చేసేందుకు వచ్చిన ఇబ్బందులు ఏమిటన్నారు. చర్చల పేరుతో, కమిటీల పేరుతో మసిపూసి మారేడు కాయ చేసే పద్ధతులు ఆపాలన్నారు. 17న చర్చలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని 27 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, 30 వేల మంది ఉద్యోగులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ అధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, రీజనల్ ప్రెసిడెంట్ ప్రేమ చంద్రశేఖర్, సెక్రటరీ ఆర్ సత్యారావు, స్టేట్ ఆఫీస్ బేరర్ పి.శ్రీనివాసరావు, జిల్లా ఆఫీస్ బేరర్ కె.నాగప్పారావు, సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖాసీం, రాంకుమార్‌లకు ఉత్తమ కరస్పాండెంట్ పురస్కారాలు


ఉత్తమ కరస్పాండెంట్ పురస్కారాలు అందుకుంటున్న ఖాసీం, రాంకుమార్

ప్రజాశక్తి-కె.కోటపాడు : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ప్రపంచ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయనగరం జిల్లా గజపతినగరంలో విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న కె.కోటపాడు అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీంకు ఉత్తమ కరస్పాండెంట్ పురస్కారం అందజేశారు. శ్రీసత్య సాయి దివ్యామృతం ఆధ్వర్యంలో బాలాజీ విద్యా సంస్థలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, గౌరవ అతిథులు టీచర్స్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి బి.విజయభాస్కర్ చేతుల మీదుగా డాక్టర్ ఖాశీం పురస్కార పత్రం అందుకున్నారు. ఉత్తమ కరస్పాండెంట్ అవార్డు అందుకున్న డాక్టర్ ఖాశీంకు అయ్యన్న స్కూల్ ఉపాధ్యాయులు, జూనియర్, డిగ్రీ కాలేజీల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శ్రీగాయత్రి ప్రైమరీ అండ్ హైస్కూల్ కరస్పాండెంట్ బత్తిన రామకుమార్ బుధవారం స్టేట్ బెస్ట్ కరెస్పాండంట్ పురస్కారాన్ని అందుకున్నారు. గజపతినగరం బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో టీచర్స్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గాయత్రి పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు రామ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

చీడిపాలెం జంక్షన్ వద్ద ముమ్మర తనిఖీలు


చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చీడిపాలెం జంక్షన్ వద్ద మంప ఎస్ఐ శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో గంజాయి నిర్మూలనే ధ్యేయంగా ఎక్కడికక్కడ తనిఖీలు చేపడుతున్నట్టు ఎస్ఐ తెలిపారు. ప్రతి వాహనాన్ని నిలిపివేసి, క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచి పెట్టారు. ఎవరైనా గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలన్నారు.

జిఎస్‌టిపై అవగాహనా ర్యాలీ


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-చింతూరు : జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు, సామాన్యులకు అర్థమయ్యేలా కళారూపాల ప్రదర్శన చింతూరు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. తొలుత ఎర్రంపేట ఐటీడీఏ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ మీదుగా విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగస్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాని కూడలి వద్ద ఏకలవ్య విద్యార్థులు నృత్య కళా రూప ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ హాజరై జీఎస్టీ అవగాహన పాటలు, నృత్యాలు కళారూపాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నోకాల్, ఎంపీడీవో సుండం శ్రీనివాస్ దొర. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ఎండి జమాల్ ఖాన్, సెక్రటరీ జగన్, చింతూరు సీఐ ఎస్ఐలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


గొండివాడ వాసులతో బిఎఫ్‌జిఎం సభ్యులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని గొండివాడ గ్రామంలో బుధవారం యూత్ ప్రెసిడెంట్ నల్లమిల్లి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ బిఎఫ్‌జిఎం టీమ్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని 60 కుటుంబాలకు 25 కేజీల రైస్ బస్తాలు, పప్పులు, నూనెలు, కూరగాయలు, బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోరగా సుదర్శన్, కంభం అజయ్, గుడ్ల రాజుబాబు, రవి పాల్గొన్నారు.